సాక్షి ఒడిశా

శుక్రవారం | 17 | మే | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,92,947లు, బంగారం 2 గ్రాముల 650 మిల్లీ గ్రాములు, వెండి 99 గ్రాముల 900మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నారాయణపూర్ గ్రామస్తుల ఆందోళన

తాగునీటి కోసం గజపతి జిల్లా రాయఘడ్ సమితి నారాయణపూర్ గ్రామస్తులు గ్రామంలో గురువారం ఆందోళన చేపట్టారు.

- 8లో




ఎలుగు దాడిలో తండ్రీ, కొడుకుకు గాయాలు

జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి రణస్పూర్ పంచాయతీ రాణిగుణ గ్రామంలో బాను ముదులి, అతడి కుమారుడు నకుల్ ముదులిలు ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డారు.

- 8లో

న్యూస్‌రీల్

అర్ధరాత్రి అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: నగరంలోని బుధవారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక మంచేశ్వర్ పోలీస్ ఠాణా పరిధి పండరా వీధిలో అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదం స్థానికులను బెంబేలెత్తించింది. ఈ ఘటనకు కారణాలు స్పష్టం కావాల్సి ఉంది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ప్రాణహాని సంభవించనట్లు సమాచారం. అగ్ని ప్రమాదంలో ఇరుగు పొరుగున ఉన్న 3 దుకాణాలు దగ్ధమయ్యాయి. ఆస్తి నష్టం లక్షల్లో ఉంటుందని ప్రాథమిక అంచనా. అగ్నికీలలు విస్తరించి పరిసరాల్లో విద్యుత్ తీగలకు తాకడంతో తెగిపోయాయి. దీంతో పరిసరాల్లో జీజీపీ కాలనీ, జగన్నాథ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా అంతరాయంతో ఇండ్లలో ప్రజలకు వీధికి ఎక్కారు. విషయం స్థానిక పోలీసులకు తెలియజేయడంతో అగ్నిమాపక దళంతో వీరు ఘటన స్థలం సందర్శించారు. ప్రమాదానికి గురైన దుకాణాల్లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఒకటి. దీనికి ఇరువైపుల కిరాణా దుకాణం, పెద్ద పండ్ల దుకాణం ఉన్నాయి. ఫాస్ట్‌ఫుడ్ దుకాణంలో నిల్వ ఉన్న వంట నూనెతో మంటలు తీవ్రంగా రగలడంతో వంట గ్యాసు సిలిండర్ పేలి ఉంటుందని భావిస్తున్నారు. ఈ పేలుడు శబ్దం స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. మొత్తం మీద 3 దుకాణాలు మంటల్లో పూర్తిగా దగ్ధమయ్యాయి.


ఎమ్మెల్యే తారాప్రసాద్‌ను చంపుతామని హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: జయపురం నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతిని హత్య చేస్తామని కొంతమంది యువకులు తుపాకీ చూపుతూ హెచ్చరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో వారు ఆయనను దుర్భాషలాడారు. అంతేకాకుండా రబినారాయణ నందో జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. ఆయన వెంటనే ఈ విషయంపై కొరాపుట్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇటువంటి బెదిరింపులకు తాను భయపడేవాడిని కాదన్నారు. కాగా గత ఎన్నికల సమయంలోనూ ఎమ్మెల్యే బాహిణీపతిపై దాడి జరిగిందని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఆనాడు స్థానిక మధుమతి లాడ్జిలో ఉంటున్న బాహిణీపతి, అతడి కుటుంబ సభ్యులపై కత్తులతో దాడి జరిగింది. అయితే ఆ సమయంలో తారాప్రసాద్ బాహిణీపతి అక్కడ లేకపోవడంతో అతడి సోదరుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆ కేసులో ఒక సీనియర్ బీజేడీ నాయకుడితో పాటు కొందరు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. కాగా మరలా ఇప్పుడు అలాంటి హెచ్చరికలు రావడంతో పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయగడ: ఒక దొంగతనం కేసుకు సంబంధించి సదరు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి స్థానిక రెల్లివీధికి చెందిన సుండి బులుగా గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతి, ఐఐసీ కమలాకాంత్ కుహోరొలు గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్థానిక గోదారీస్ నగర్‌లో నివాసముంటున్న సంతోష్ గౌడ అనే వ్యక్తి వాతావరణం వేడిగా ఉండడంతో గురువారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తెరిచి పడుకున్నాడు. ఇదే అదునుగా భావించిన దొంగ ఇంటిలోకి చొరబడి ఇంటిలోని ఒక బంగారు గొలుసు, ఒక జత ఇయర్ రింగ్స్‌తో పాటు మరో రెండు సెల్ ఫోన్లు దొంగలించాడు. దీంతో బాధితుడు సదరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి పన్నెండు గంటల్లోనే నిందితుడిని పట్టుకొని అతని నుంచి ఒక బంగారు గొలుసు, ఒక జత ఇయర్ రింగ్స్, మూడు వెండి గిన్నెలు, మరో 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

గోపాల్‌పూర్ గుండెకోత



గోపాల్‌పూర్ తీరంలో ఎగసిపడుతున్న అలలు(ఫైల్)



అలల తాకిడికి కూలిపోయిన హోటల్స్ ప్రహరీలు (ఫైల్)

- కోతకు గురవుతున్న సముద్ర తీరం
- అమలు కానీ సీఆర్‌జెడ్ చట్టం
- తీరం వెంబడి బహుళ అంతస్తుల నిర్మాణాలు

బరంపురం:

సిల్క్ సిటీగా పేరుగాంచిన బరంపురం నగరం అందాన్ని ఇనుమడింపచేసే గోపాల్‌పూర్ సముద్ర తీరం ఏళ్ల తరబడి నిశ్శబ్దంగా కోతకు గురవుతోంది. ఈ కోతకు కారణమేమిటనే తీరవాసుల ప్రశ్నలకు నిపుణులు చెప్పే సమాధానాలు వారిని ఆందోళనకు గురి చేస్తోంది. అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందిన గోపాల్‌పూర్ తీరానికి శోభను తెచ్చే గోపాల్‌పూర్ పోర్టు, బహుళ అంతస్తుల అక్రమ కట్టడాలు తీరం కోతకు ప్రధాన కారణమని స్పష్టం చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్‌లు కారణంగా సముద్రం పోటెత్తి అలలు ఎగసిపడి తీరాన్ని తాకుతాయి. దీని ఫలితంగా గంజాం జిల్లా 37 కిలోమీటర్ల పొడువు ఉన్నా తీరం పూర్తిగా కోతకి గురవుతోంది. సూన్‌పూర్ నుంచి గోపాల్‌పూర్ మీదుగా అర్జిపల్లి తీరం పొడవునా కోతకి గురవుతుండడంతో అధికారులు సైతం ఆందోళనకు గురవుతున్నారు.

నిబంధనలకు నీళ్లు


దేశంలో తీరప్రాంతాల రక్షణకు కేంద్రం 1992లో కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం ప్రకారం సముద్ర తీరం నుంచి ఐదు వందల మీటర్ల వరకూ ఎలాంటి నిర్మాణాలు చేయరాదన్న నిబంధన ఉంది. స్థానిక సంస్థలను సమన్వయం చేసుకుంటూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ చట్టం అమలయ్యేలా చూడాల్సి ఉంటుంది. అయితే ఆంధ్ర సరిహద్దు ఇచ్ఛాపురం అనుకొని ఉన్న సూన్‌పూర్ (ఒడిశా) నుంచి గోపాల్‌పూర్, ఛత్రపూర్, అర్జిపల్లి వరకు 28 కిలోమీటర్లు పొడవైన బీచ్ వెంబడి అనేక కట్టడాలు వెలిశాయి. కోస్తా నియంత్రణ మండలి చట్టానికి వ్యతిరేకంగా గోపాల్‌పూర్ బీచ్‌కి దగ్గరలో బహుళ అంతస్తులతో హోటల్స్ నిర్మించారు. కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) చట్టం ఉల్లంఘనను మొదట్లో తీవ్రంగా పరిగణించిన పాలకులు తర్వాత అనేక ఒత్తిళ్ల కారణంగా పట్టించుకోవడం మానేశారు. దీని ఫలితంగా నిబంధనలకు విరుద్ధంగా జోరుగా నిర్మాణాలు సాగుతున్నాయి. విపత్తులను ఎదుర్కొనేందుకు తీరంలో మడ అడవులు, చిత్తడి నేలలు, సరుగుడు తోటలను తొలగించి నిర్మాణాలు చేపట్టడంతో కోస్తా రెగ్యులేషన్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీకి పలు ప్రజా సంఘాల ద్వారా ఫిర్యాదులు అందాయి. దీంతో వెంటనే వాటిని తొలగించాలని కొద్దికాలం క్రితం కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు.

తుఫాన్ జోన్‌గా గోపాల్‌పూర్

గత 15 ఏళ్లలో సూపర్‌సైక్లోన్, ఫైలిన్ తుఫాన్, హుద్‌హుద్ తుఫాన్లతో గోపాల్‌పూర్ తుఫాన్ జోన్‌గా కేంద్ర వాతావరణ అధ్యయన కేంద్ర బృందం నిర్ధారించింది. ప్రస్తుతం వారం రోజులుగా అకాల వర్షంతో సముద్రం పోటేత్తి గోపాల్‌పూర్ తీరం అలల తాకిడికి తీరం కోతకు గురైంది. ముఖ్యంగా గంజాం జిల్లాలో కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) చట్టాలను అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం తప్ప, ప్రత్యేకించి విభాగం లేకపోవడం ఇందుకు పెద్ద లోపంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో సముద్రమట్టాలు పెరుగుతున్నాయని నిపుణులు తెలియజేస్తున్నారు. గోపాల్‌పూర్ తీరంలో నిర్మించిన బహుళ అంతస్తుల హోటల్స్ తీరంపై ప్రభావం చూపుతున్నాయి. సముద్రం మీదుగా వచ్చే గాలులకు బహుళ అంతస్తులు అడ్డుగా ఉండడంతో, గాలులు తిరిగి వెనక్కి వెళ్తుంటాయి. ఈ ప్రభావం వలన తీరం కోతకు గురవుతోందని వాతావరణ అధ్యయన కేంద్రం సంచారకులు సరత్ చంద్ర సాహు తెలియజేస్తున్నారు. ఇదేవిధంగా గోపాల్‌పూర్ పోర్టులో కొత్తగా రెండు బెర్త్‌ల నిర్మాణం చేపట్టంతో సముద్రం లోపలకి సుమారు 3 కిలోమీటర్ల పొడువున పెద్ద పెద్ద బండరాళ్లు వేశారు. నిర్మాణం చేపడుతుండడంతో సముద్రం నుంచి వచ్చిన అలలకు కొత్తగా నిర్మాణం జరుగుతున్న రెండు బెర్తులు అడ్డుకావడంతో జిల్లా తీరప్రాంతం కోతకి గురవుతోంది. అందువలన ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి తీరం కోతకు గురవ్వకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.



కోతకి గురవుతున్న గోపాల్‌పూర్ తీరం



తీరంలోని పోర్టులో వేస్తున్న బండరాళ్లు

కేంద్ర ప్రభుత్వ నిధులు అడ్డదారి



బహిరంగ సభలో పాల్గొన్న జన సందోహం

- ఒడిశాలో బీజేపీ విజయం తథ్యం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా




ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా


బరంపురం: కేంద్ర ప్రభుత్వం ఒడిశా రాష్ట్రానికి అందిస్తున్న నిధులు అడ్డదారిలో మళ్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గంజాం జిల్లా సురడాలో బహిరంగ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులతో పాటు జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన వివిధ రకాల పథకాలను, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. బీజేడీ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో రైతుల ఆత్మహత్యల సంఖ్య పెరిగిందని దుయ్యబట్టారు. నష్టపోయిన ఖరీఫ్ రైతుల రుణాలు మాఫీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వలన ఇప్పటివరకు సుమారు 12 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఒడిశా ప్రజలు బీజేడీ నవీన్ ప్రభుత్వంపై పూర్తిగా విసుగు చెందారని, రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం విజయం తథ్యమని చెప్పారు. బహిరంగ సభలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్, అస్కా బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అనిత ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

సీఎం నవీన్ విశ్రాంతి తీసుకోవాలి

- రాష్ట్ర ప్రజలు అదే కోరుకుంటున్నారు
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా
- భువనేశ్వర్‌లో రోడ్డు షో



రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు



ప్రజలకు అభివాదం చేస్తున్న జేపీ నడ్డా

భువనేశ్వర్: రాష్ట్రానికి ఆరోగ్యవంతమైన, చురుకైన ముఖ్యమంత్రి అవసరమని, అందువలన సీఎం నవీన్ పట్నాయక్ విశ్రాంతి తీసుకోవాలని ఒడిశా ప్రజలు కోరుకుంటున్నారని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. భువనేశ్వర్‌లో గురువారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు మార్పు తీసుకురావాలని, బీజేపీని ఆశీర్వదించాలని నిర్ణయించుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఈసారి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 3వ సారి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని 21 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో మూడు రోజుల్లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లకు ముఖ్యమంత్రి అభ్యర్థులను పార్టీ ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమృద్ధి ఒడిశాగా మార్చడం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవ చేయడం బీజేపీ లక్ష్యంగా పేర్కొన్నారు. అలాగే ఒడిశా ముఖ్యమంత్రి అభ్యర్థిని కూడా ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక మౌసి మా ఆలయం నుంచి లింగరాజ్ ఆలయం వరకు జరిగిన రోడ్ షోలో భువనేశ్వర్ లోక్‌సభ అభ్యర్థి అపరాజిత షడంగి, భువనేశ్వర్ ఏకామ్రా అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బాబు సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

సీఈసీ వీడియో కాన్ఫరెన్స్



భువనేశ్వర్: ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 5, 6వ విడత పోలింగ్ కార్యకలాపాలను భారత ఎన్నికల సంఘం గురువారం సమీక్షించింది. ఈ నేపథ్యంలో 5వ దశలో 49 పార్లమెంటరీ నియోజకవర్గాలు, 6వ దశలో 57 పార్లమెంటరీ నియోజకవర్గాల సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఈ సదస్సులో పాలుపంచుకున్నారు.

మర్యాదపూర్వక భేటీ



ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సంస్థకు కొత్తగా నియమితులైన వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ డాక్టర్ మానస్ రంజన్ సాహు గురువారం స్థానిక రాజ్‌భవన్‌ను సందర్శించారు. దీనిలో భాగంగా రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ రఘుబర దాస్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

- భువనేశ్వర్

మరోసారి పరస్పర దాడులు



ఫిర్యాదు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు దీపక్ కుమార్ పట్నాయక్

బరంపురం: గంజాం జిల్లాలో రాజకీయ దాడులు కొనసాగుతున్నాయి. ఈనెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ రోజున బరంపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డా.ప్రదీప్ పాణిగ్రాహిపై, బరంపురం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మేయర్ శిబశంకర్ దాస్ అలియాస్ పింకు దాస్ దాడిచేసి గాయపరిచిన విషయం తెలిసిందే. దీంతో గోపాల్‌పూర్ నియోజకవర్గం, చికిటి నియోజకవర్గంలో బీజేపీ, బీజేడీ నాయకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ హింసాత్మక ఘటనలు మరువకముందే మంగళవారం రాత్రి మరోసారి హింస చెలరేగింది. జిల్లాలోని కళ్లికోట్‌లో బీజేపీ, బీజేడీ పార్టీ నాయకులు మారణాయుధాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో 8 మందికి తీవ్రగాయలయ్యాయి. దీంతో బాధితుల కుటుంబ సభ్యులు కళ్లికోట్ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకి దిగారు. మరోవైపు జిల్లాలోని దిగపండి పోలీసుస్టేషన్ పరిధి కుకుడాఖండి గ్రామంలో కాంగ్రెస్ నాయకులపై బీజేడీ నాయకులు కర్రలతో దాడిచేసి గాయపరిచిన ఘటన స్థానికంగా ఉద్రిక్తంగా మారింది. ఈ హింసాత్మక ఘటనలో ముగ్గురికి తీవ్రగాయలయ్యాయి. ఈ ఘటనపై బీజేడీ నాయకులపై డీసీసీ అధ్యక్షుడు దీపక్ కుమార్ పట్నాయక్ సదర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు కళ్లికోట్‌లో బీజేపీ, బీజేడీ పార్టీ నాయకులపై మారణాయుధాలతో పరస్పర దాడులకు సంబంధించి 8 మందిని అరెస్టు చేసినట్లు గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన తెలియజేస్తున్నారు.



కళ్లికోట్‌లో తీవ్రంగా గాయపడిన గ్రామస్తులు



కుకుడాఖండిలో తీవ్రంగా గాయపడిన కాంగ్రెస్ మద్దతుదారులు



కళ్లికోట్ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

నాటుసారా, మద్యం సీసాలు ధ్వంసం


నాటుసారా ధ్వంసం చేయిస్తున్న అధికారులు

సోంపేట: సోంపేట స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో గడిచిన ఆరు నెలల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన 4817 లీటర్ల నాటు సారా, 43 లీటర్ల మద్యం నిల్వలను గురువారం స్టేషన్ సమీపంలో ధ్వంసం చేశారు. విశాఖ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వుల మేరకు పలాస డివిజన్ అసిస్టెంట్ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఇస్మాత్ ఆరా బేగం ఆధ్వర్యంలో మద్యం నిల్వలు ధ్వంసం చేసినట్లు సోంపేట ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు.

ఆరో ర్యాంకు సాధించిన విద్యార్థికి అభినందనలు


పెనుపర్తి జగదీష్

కొత్తూరు: కొత్తూరు మండలం క్లెమ్మ పంచాయతీ పరిధి నేతాజి నగర్ కాలనీకి చెందిన పెనుపర్తి జగదీష్ రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను కనబరిచాడు. కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన జగదీష్ ఏపీఆర్జీసీలో వందకు 96 సాధించి రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు తెచ్చుకున్నాడు. దీనిపై కాలేజి ప్రిన్సిపాల్ రవికుమార్‌తో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు. జగదీష్ తల్లిదండ్రులు బుల్లేశ్వరరావు కృష్ణవేణిలు కార్పెంటరీ పనులు చేస్తూ కుమారుడిని చదివించారు.


నవధాన్యాల సాగుతో భూసారం పెంపు


మాట్లాడుతున్న డీపీఎం ధనుంజయరావు

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ వరి సాగుకు ముందు తొలకరి వర్షాల్లో నవధాన్యాలను సాగు చేసుకోవటం వల్ల భూసారం పెంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎం ధనుంజయరావు అన్నారు. మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో పాటు కొత్తూరు డివిజన్ స్థాయి ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవధాన్యాల విత్తనాలను వేసుకున్న తర్వాత మొలకలు వచ్చిన 30 నుంచి 50 రోజుల మధ్యలో ఆయా మొక్కలను పొలంలో కలియదున్నటం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ఎరువులు, పురుగుల మందులు విచక్షణరహితంగా వినియోగించటం వల్ల భూసారం క్షీణిస్తుందన్నారు. భూసారం పెంచేందుకు రైతులు తనవంతు ప్రయత్నం చేయాలన్నారు. ఇందుకు రైతులకు అవగాహన కలిగించాల్సిన అవసరం మనపైన ఉందన్నారు. కార్యక్రమంలో రీజనల్ అధికారి హేమసుందరరావు, డివిజన్ ఇన్‌చార్జ్ ఎన్ఎఫ్ఏ గోవిందరెడ్డి, ఐటీడీఏ ఎన్ఎఫ్ఏ ముసలయ్య, ఎంటీ సూర్యనారాయణ, మార్కెటింగ్ ఎంటీ చిన్నమ్మడు, ఐసీఆర్పీ, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

జెమ్స్‌లో అవయవదానం

- కిడ్నీ, లివర్ విశాఖపట్నంకు తరలింపు
- మరో కిడ్నీ జెమ్స్‌లోనే రోగికి మార్పు
- చిరంజీవిగా నిలిచిన శ్రీనివాసరావు


జెమ్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీనివాసరావు ఫ్లెక్సీ

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గురువారం అవయవదానం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలను జెమ్స్ వైద్యులు తెలిపారు. శ్రీకాకుళం పరిధిలోని చినమండల వీధికి చెందిన తోట శ్రీనివాసరావు (46) ఈ నెల 14న పెయింటింగ్ పనికి వెళ్తూ సూర్యమహల్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అదే రోజు జెమ్స్‌లో చేరారు. 15వ తేదీ తర్వాత ఆయన బ్రెయిన్ పూర్తిగా పనిచేయడం లేదని వైద్యులు ధ్రువీకరించారు. వెంటిలేటర్‌పై చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. శరీరంలో ఎలాంటి కదలికలు లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. ఆయన కుమారుడు జ్యోతి ప్రకాశ్, చెల్లి సరితాలు కలిసి అవయవదాన సంస్థ గల జీవనదాన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో శ్రీనివాసరావు కిడ్నీ, లివర్‌ను విశాఖపట్నంకు తరలించగా, మరో కిడ్నీని ఇదే ఆస్పత్రిలో వేరే బాధితునికి అమర్చారు. అనంతరం అమరహే శ్రీనివాస్ అంటూ విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది దారి పొడవునా నివాళులర్పించారు.


అవయవదానానికి సంబంధించిన సర్టిఫికెట్‌ను కుటుంబ సభ్యులు ఇస్తున్న దృశ్యం

ఎన్నికల్లో హింస సరికాదు

- సీఎం నవీన్ పట్నాయక్ ఖండన
- బీజేడీ హస్తంపై బీజేపీ ఆరోపణ

భువనేశ్వర్: గంజాం జిల్లా ఖల్లికోట్ పోలీసు ఠాణా పరిధిలోని కృష్ణశరణ్ పూర్ గ్రామంలో బుధవారం బిజూ జనతా దళ్ (బీజేడీ), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో బీజేపీ కార్యకర్త ఒకరు మృతి చెందగా మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. అధికార బీజేడీ, బీజేపీ మద్దతుదారులు ఎన్నికల పోస్టర్లు అంటించే వైనంతో రగిలిన వివాదం ఘోరమైన ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణ ఒక వ్యక్తి ప్రాణాలను బలిగొంది. మృతుడు దిలీప్ పహాన్ (43)గా గుర్తించారు. పహాన్ మృతితో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. దీంతో సీఎం నవీన్ పట్నాయక్ ఖల్లికోట్ ఎన్నికల హింసాత్మక ఘటనను ఖండించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఎక్స్ హ్యాండిల్‌లో ఖల్లికోట్ ప్రాంతంలో జరిగిన సంఘటన చాలా దురదృష్టకరం, విషాదకరమైన హింసాత్మక సంఘటనగా వ్యాఖ్యానించారు. దీనిపై తీవ్ర కలత మరియు విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి హింసాత్మక ఘటనలకు మన ప్రజాస్వామ్యంలో చోటు లేదన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలియజేశారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. నేరానికి పాల్పడిన వారిపై పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఓటమి భయంతోనే దాడులు

మరోవైపు ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే అధికార పార్టీ హింసకు పాల్పడుతోందని బీజేపీ నేత, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలపై బీజేడీ కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కార్యకర్తల త్యాగాలు వృథా కావు అని, ఒడిశా ప్రజలు బ్యాలెట్ ద్వారా తగిన సమాధానం ఇస్తారని ధ్వజమెత్తారు. ఘటనపై ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేశారు.

హింస నివారణకు చర్యలు తీసుకోవాలి: సీఈవో

రాష్ట్రంలో రెండో దశ ఎన్నికలకు ముందు జరిగిన సంఘటనపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) నికుంజ బిహారీ ధొలా తీవ్రంగా స్పందించారు. ఈ ఘర్షణ నేపథ్యంలో ముందస్తు ఎన్నికల హింసను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని గంజాం జిల్లా కలెక్టర్, ఎస్పీని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి హింసాత్మక ఘటనలను సహించబోమని స్పష్టం చేశారు.

పరారీలో ప్రధాన నిందితుడు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) నికుంజ బిహారీ ధొలా ఆదేశాల మేరకు ఖల్లికోట్ ఠాణా పోలీసులు కృష్ణశరణ్ పూర్ గ్రామంలో బుధవారం రాత్రి బీజేపీ, బీజేడీల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరి ప్రాణాలను బలిగొన్న సంఘటనలో ఎనిమిది మంది నిందితులను గురువారం అరెస్టు చేశారు. ఒకరు మృతి చెందిన ఈ ఘర్షణలో ప్రధాన నిందితుడు ఇంకా పరారీలో ఉన్నాడు.

గృహహింస కేసులో మహంతికి ఊరట

- అరెస్టుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

భువనేశ్వర్: రాజకీయ నాయకుడుగా మారిన చలన చిత్ర నటుడు, ఎంపీ అనుభవ్ మహంతికి రాష్ట్ర హైకోర్టు భారీ ఊరటనిచ్చింది. అతనిపై 4 ఏళ్ల కిందట నమోదైన గృహ హింస కేసుకు సంబంధించి ఒరిస్సా హైకోర్టు గురువారం అతని అరెస్టుకు సంబంధించి జారీ అయిన బెయిలు రహిత అరెస్ట్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ)పై స్టే విధించింది. ప్రస్తుతం భార్యాభర్తలు (అనుభవ్ మహంతి - వర్షా ప్రియదర్శిని) చట్టపరంగా విడాకులు పొందారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులను విచారిస్తున్న కటక్‌లోని ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (జేఎంఎఫ్‌సీ) దీపంకర్ బాల్ కోర్టు విచారణకు పార్లమెంట్ సభ్యుడు గైర్హాజరైన నేపథ్యంలో ఎన్‌బీడబ్ల్యూ మే 23 నాటికి అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన మూడు రోజుల తర్వాత హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దశలో మినీ ట్రయల్‌పై ప్రాసిక్యూషన్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు, దర్యాప్తు అధికారి తగిన సాక్ష్యాధారాలు, సాక్షులతో ప్రాథమిక కేసును రూపొందించారని సమర్పించిన తర్వాత అనుభవ్ మొహంతి దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు గతంలో తోసిపుచ్చింది.

ఇదీ విషయం...

2020 డిసెంబర్‌లో కటక్‌లోని నందిసాహి వద్ద నున్న తన ఇంట్లో అనుభవ్ మహంతి మరియు అతని ఇద్దరు స్నేహితులు ఈడ్చుకుని వెళ్లి తాళం వేసి వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వర్ష ప్రియదర్శిని పూరీఘాట్ ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా విచారణ తర్వాత 2023 డిసెంబర్ 18న సెక్షన్లు 509 (మహిళను అవమానించడం), 498-ఏ (క్రూరత్వం), 341 (తప్పుడు సంయమనం), 294 (అసభ్య పద జాలం ఉపయోగించడం), 506 (క్రిమినల్) కింద అనుభవ్ మహంతీని ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. అనుభవ్, వర్ష ప్రియదర్శిని వైవాహిక బంధం రద్దు చేసి విడాకులు మంజూరు చేసేందుకు కటక్ ఫ్యామిలీ కోర్టు నిరాకరించిన ఉత్తర్వులను తోసిపుచ్చి రాష్ట్ర హైకోర్టు 2023 డిసెంబర్‌లో విడాకులు మంజూరు చేసి భార్యాభర్తల వివాదానికి చుక్క పెట్టింది. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో న్యాయ స్థానం విడాకుల డిక్రీని మంజూరు చేసింది.

ఎలుగు దాడిలో తండ్రీ, కొడుకుకు గాయాలు


చికిత్స పొందుతున్న బాసు ముదిలి

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి రణస్‌పూర్ పంచాయతీ రాణిగుణ గ్రామంలో బాసు ముదులి, అతడి కుమారుడు నకుల్ ముదులిలు ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. తమ ఇంటి కప్పు నేతకు గడ్డి వెదురులు, తాళ్ల సంగ్రహించేందుకు బాసు, నకుల్‌లు మంగళవారం అడవికి వెళ్లారు. అక్కడ వారిపై ఎలుగుబంటి దాడి చేసింది. ఆ దాడిలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారి ఆర్తనాదాలు విని ఆ ప్రాంతంలో ఉన్నవారు వెళ్లగా వారిని చూసి ఎలుగుబంటి అడవిలోనికి పారిపోయింది. గాయపడిన ఇరువురిని బిసింగపూర్ ప్రాథమిక వైద్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండడంతో బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం డాక్టర్లు వారిని కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి పంపించారు. కానీ అచ్చట కూడా వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో బరంపురం తీసుకెళ్లమని డాక్టర్లు వారి బంధువులకు సూచించారు. అయితే మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే వారికి బరంపురం వెళ్లి అచ్చట పరిస్థితులు తెలియక, డబ్బు లేకపోవడంతో బరంపురం వెళ్లేందుకు భయపడ్డారు. ప్రస్తుతం కొరాపుట్‌లోనే చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

రెచ్చిపోతున్న బైక్‌ల దొంగలు


పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహాపాత్రో

జయపురం: బొరిగుమ్మ సమితిలో బైక్‌ల దొంగలు రెచ్చిపోతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు దొంగలను పట్టుకోవడంలో విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. గురువారం ఒక మందిరం వద్ద బైక్ ఉంచి పూజలు చేసి వచ్చేసరికి బైక్ దొంగిలించబడింది. వివరాల్లోకి వెళ్తే.. బొరిగుమ్మ సమీప నువాగాం గ్రామానికి చెందిన రవీంద్ర మహాపాత్రో దైవ దర్శనం చేసుకునేందుకు బైక్‌పై బొరిగుమ్మ వెళ్లాడు.

ఆలయం ముందు బైక్ పెట్టి ఆలయంలోకి వెళ్లి పూజచేసి, తిరిగి వచ్చి బైక్ పెట్టిన ప్రాంతానికి వెళ్లి చూడగా అక్కడ బైక్ కనిపించలేదు. దీంతో ఖంగుతిన్న మహాపాత్రో ఆ ప్రాంతంలో ఉన్నవారిని వాకబు చేశాడు. అయితే తామెవరీ చూడలేదని తెలపడంతో తన మిత్రులతో కలిసి బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'హార్టికల్చర్‌పై దృష్టి సారించండి'


మాట్లాడుతున్న ఏపీడీ శైలజ

మెళియాపుట్టి: మండలంలో అత్యధిక ఎకరాల్లో హార్టికల్చర్ ద్వారా మొక్కలు నాటడానికి రైతులకు అవగాహన కల్పించాలని టెక్కలి ఏపీడీ శైలజ అన్నారు. గురువారం మండలంలోని ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. హార్టికల్చర్ ద్వారా మొక్కలు నాటితే రైతులకు ఆదాయ వనరులు లభిస్తాయన్నారు. అదేవిధంగా రైతుల పొలాల్లో ఫారం పాండ్‌ల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పని దినాలు కల్పించాలని అన్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే 100 రోజుల పనిదినాల కల్పనపై దృష్టిసారించాలని అన్నారు. ఏపీఓ రవి, ఈసీ ఆది నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

నారాయణపూర్ గ్రామస్తుల ఆందోళన


రోడ్డుకు అడ్డంగా బిందెలు, కర్రలు పెట్టిన దృశ్యం


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ్ సమితి నారాయణపూర్ గ్రామస్తులు గ్రామంలో గురువారం ఆందోళన చేపట్టారు. దీంతో పర్లాకిమిడి - ఆర్.ఉదయగిరి - మోహనా రోడ్డు, బరంపురానికి వెళ్లాల్సిన బస్సులు, వాహనాలు నిలిచిపోయాయి. గ్రామంలో తాగునీటికి అనేక నెలలుగా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కన ఉన్న బొమ్మిక గ్రామం మహేంద్రతనయ నుంచి వేసిన పైపులు తక్కువ సమయంలోనే పనిచేయడం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. నారాయణపూర్ గ్రామంలో ఉన్న చెరువులు ఎండిపోయాయి. ఎన్నికల ముందు అధికారులు, ఎమ్మెల్యే దాశరథి గొమాంగో ఎన్ని హామీలు ఇచ్చినా అవి బుట్టదాఖలయ్యాయన్నారు. తాగునీటి సమస్య కోసం చేపడుతున్న రాస్తారోకో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సంఘటన స్థలానికి బీడీవో సుధీర్ కుమార్ సింగ్ విచ్చేసి, ఆందోళనకారులతో మాట్లాడి తాగునీటి సమస్యను ఎన్నికల పోలింగ్ తర్వాత పరిష్కరిస్తామన్నారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

రిగ్గింగ్‌పై ఫిర్యాదు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి పెద్ద కొత్తూరు బూత్ నంబర్ 259లో పోలింగ్ రోజు బీజేడీ పార్టీ ఏజెంట్లు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని కాంగ్రెస్ అభ్యర్థి బిజయ కుమార్ పట్నాయక్ పర్లాకిమిడి రిటర్నింగ్ అధికారి అలోక్ పండాకు గురువారం ఫిర్యాదు చేశారు. రిగ్గింగ్ దృశ్యాలను సీసీ టీవీ ఫుటేజీలో పరిశీలించి తిరిగి పోలింగ్ నిర్వహించాలని కోరారు.

అక్రమ మద్యం సీజ్


సెబ్ అధికారులు పట్టుకున్న ఒడిశా మద్యం బాటిళ్లు, ద్విచక్ర వాహనం

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామం వద్ద అక్రమంగా ఒడిశా నుంచి మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని, సరుకును సెబ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ దాడిలో ఒడిశా రాష్ట్ర పరిధి గంగాధరపురం గ్రామానికి చెందిన మొగిలి లక్ష్మీనారాయణ అనే వ్యక్తి 60 ఒడిశా బీరు బాటిళ్లను బజాజ్ పల్సర్ బైక్‌లో తీసుకొస్తుండగా మాటువేసి పట్టుకున్నారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి, బీరు బాటిళ్లను, రవాణాకు ఉపయోగించిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ దాడిలో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్. జైభీమ్ , పలాస టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ విజయవంతం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. ముఖ్యంగా అధికారుల సమన్వయం, సమష్టి కృషితోనే అది సాధ్యమైందని ఆయన తెలిపా రు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా ఆర్ఓలు, నోడల్ అధికారులతో సమావేశమై.. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషకరమని, జీవితకాలం ఈ జ్ఞాపకాలు చెరిగిపోవని అన్నారు.

అద్భుతంగా పనిచేశారు..

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి రోజే జేసీ నవీన్‌తో 'జిల్లాలో ఎక్కువ మంది ఐఏఎస్‌లు ఉన్నారు. ఎన్నికల పనులు ఇక్కడ నడవకూడదు పరిగెత్తాలి' అని అన్నానని ఆయన గుర్తు చేశారు. అందుకే వెంటనే కంప్లైంట్ మానిటరింగ్ సెల్ తెరిచామని, అందులో 1600 ఫిర్యాదులు వచ్చా యని, పక్కా ప్రణాళిక వేసుకుని, సున్నితంగా పనులు నిర్వహించామని తెలిపారు. ఒక్కోసారి కుటుంబానికి దూరంగా 20 గంటలు కూడా నిరంతరాయంగా పనిచేయాల్సి వచ్చేదని, అంతా కష్టపడి పనిచేశారని ప్రశంసించారు.

జాయింట్ కలెక్టర్ నవీన్‌ని ప్రతేకంగా అభినందించా రు. ఎన్నికలు విజయవంతం చేయడంలో ఆయనది కీలక పాత్ర అని తెలిపారు. హింసాత్మక ఘటనలు జరగకుండా అడ్డుకట్ట వేయడంలో ఎస్పీ, రీపోలింగ్ జరగకుండా చేయ డంలో సబ్ కలెక్టర్, ఆర్వోలు చేసిన కృషి, గత నాలుగు నెల లుగా నోడల్ అధికారుల పనితీరు.. అన్నీ ఎన్నికలు పూర్తి విజయవంతం చేయడానికి సహకరించాయన్నారు. డేటా ఎంట్రీ, మానవ వనరుల నిర్వహణలో కిరణ్, రవాణా విషయంలో ఆర్టీసీ, డీటీసీ, రికార్డుల నిర్వహణలో చక్రవర్తి, మీడియా సర్టిఫికేషన్‌లో చెన్నకేశవరావు, ఎంసీసీ అమలులో తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేసే సీపీఓ ప్రసన్న లక్ష్మి అద్భుతంగా విధులు నిర్వహించారని చెప్పారు. 22 వేల మందికి శిక్షణలు ఇవ్వడంలో పొరపాట్లకు తావివ్వని, రాష్ట్రంలోనే బెస్ట్ మాస్టర్ ట్రైనర్లు మనకి ఉండటం, చిన్న తప్పు కూడా దొర్లకుండా పనిచేసిన కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన సిబ్బంది, ఈవీఎంల విషయంలో కచ్చితత్వంతో పని చేసిన వారికి, అన్ని విభాగాలను సమన్వయం చేసిన జిల్లా రెవె న్యూ అధికారి అంతా ప్రశంసలకు అర్హులేనని తెలిపారు. భోజనం , వసతి, రవాణా విషయంలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు లేవనో, కరెంటు లేదనో, ఓట్ల గల్లంతనో, ఇంకా మరేదోననే ఫిర్యాదులు లేనే లేవని తెలిపారు. ఇక మిగిలిన కౌంటింగ్ ప్రక్రియను కూడా ఇంతే నిబద్ధతతో పూర్తి చేద్దామని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో వారి వారి అనుభవాలను పంచుకున్నారు. కొ న్ని సందర్భాల్లో కష్టమైనా తాజా ఫలితం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. చిన్నచిన్న అంశాల్లో సైతం జిల్లా కలెక్టర్ సీరియస్‌గా స్పందించిన విషయాలు క్షేత్రస్థాయిలో తమకు ఎంతగా ఉపయోగపడినదీ వివరించారు. ఒకవేళ కొద్ది సేపు కరెంటు లేకపోతే అనే ఆలోచన లోనుంచి, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక చార్జింగ్ బల్బ్ ఉండేలా వాటిని హు టాహుటిన తెప్పించిన రోజును, కచ్చితంగా అన్ని చోట్లా దో మలు లేకుండా ఫాగింగ్ చేయాలనే అంశాన్ని, ప్రతి చోటా భోజనం వేడిగా, రుచిగా తిన్న విషయాన్ని గుర్తు చేసుకున్నా రు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఒక వీల్ చైర్ కనీసం ఉండేలా, క్యూలైన్ నిర్వహణ కోసం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, మాజీ సైని క ఉద్యోగులు ఒక్కరైనా ఉండేలా చూసిన తీరు, పోలింగ్ రోజు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉన్న కలెక్టర్ వ్యవహరించిన విధానాన్ని, సున్నితమైన అంశాలపై కూడా ఆయన స్పందించిన తీరుపై పలువురు నోడల్ అధికారులు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మొత్తంగా ఎన్నికల నిర్వహణలో కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని, ఎన్నికల విజయంలో తమను భాగస్వాములు చేసిన జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్‌కు అధికారులంతా కృతజ్ఞతలు తెలిపారు.

మన తిరుమల

- నేటి నుంచి నారాయణ తిరుమలలో శ్రీవారి కల్యాణోత్సవాలు
- ఆధ్యాత్మిక శోభతో వెలుగొందుతున్న ఆలయం
- రూ.50లక్షలతో మహామండప నిర్మాణం
- రూ.2కోట్లతో శ్రీవారి పుష్కరిణి పనులకు అంచనా



శ్రీకాకుళం కల్చరల్: ఉత్తరాంధ్ర తిరుమలగా పేరుగాంచిన నారాయణ తిరుమలలో శ్రీవారి కల్యాణోత్సవాలకు వేళయ్యింది. ఈ ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో నడుస్తోంది. తిరుమల వెంకన్న ఆలయంలో జరిగిన పూజా విధానాలతో నిత్యం భక్తుల రద్దీతో ఈ ఆలయం విరాజిల్లుతోంది. ఆలయంలో స్వామి కల్యాణోత్సవాలు ఈనెల 17 నుంచి 23 వరకు పాంచరాత్ర ఆగమనం ప్రకారం నిర్వహిస్తున్నారు.

ఆలయ చరిత్ర

ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయం 1961 ఏప్రిల్ 21న ఏర్పాటైంది. అప్పట్లో ఈ ప్రాంతం కొండలతో, గుట్టలతో నిండి ఉండేది. ఈ ఆలయాన్ని గురుగుబెల్లి నారాయణ దాసు నిర్మించారు. ఆయన కలలో వేంకటేశ్వరస్వామి కనిపించి శ్రీవారి పాద ముద్రలు ఉన్న ప్రదేశంలో ఆలయం నిర్మించాలని ఆదేశించారని చెబుతుంటారు. పాదముద్రల కోసం వెతకగా పట్టణంలోని నాగావళికి పశ్చిమ దిశలో పాదముద్రలు కనిపించాయి. అప్పటికే చుట్టు పక్కల ఉండే ప్రజలు ఆ పాదాలకు పూజలు చేయడం కనిపించింది. ఆ ప్రదేశంలో తన శిష్యులతో కొన్ని రోజులు నిద్రచేయగా శ్రీవారు మళ్లీ కలలో కనపడి ఆలయ నిర్మాణానికి తగిన స్థలం ఇదేనని చెప్పారట. ఆలయ నిర్మాణం పూర్తి చేసిన అనంతరం తిరుపతి నుంచి భూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలను తీసుకువచ్చి 1961 ఏప్రిల్ 21 నుంచి 25 వరకు ప్రతిష్టాపనోత్సవం నిర్వహించారు. నాటి నుంచి ఈ ఆలయం నారాయణ తిరుమలగా ప్రసిద్ధి గాంచింది.

ఆకర్షణగా 50 అడుగుల విగ్రహాలు

ఆలయాన్ని దూరం నుంచి చూసేవారికి కూడా ఆకర్షణీయంగా కనిపించేలా పెద్ద పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇందులో 48 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, 52 అడుగుల గరుడాళ్వార్ విగ్రహం, 50 అడుగుల స్వామివారి విశ్వరూప దర్శనం ఏర్పాటుచేశారు.

రూ.50లక్షలతో మహామండప నిర్మాణం

స్వామికి నిత్య కైంకర్యాలు నిర్వహించేందుకు, వెయ్యిమంది భక్తులు ఒకేసారి వేడుకలను వీక్షించేందుకు మహా మండపాన్ని ఆలయం పక్కనే నిర్మించారు. మండపాన్ని నిర్మించడానికి సుమారు రూ.50లక్షలు వెచ్చించారు. అక్కడ స్వామివారి కల్యాణ వేడుకలతో పాటుగా ఇతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

బేడా మండపంలో దేవతామూర్తులు

ఆలయం చుట్టూ ఉన్న బేడా మండపాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దారు. చుట్టూ దేవతామూర్తులు, స్వామివారి దశావతారాల విగ్రహాలతో అలరారుతోంది. స్వామి వైభవాన్ని చాటేందుకు భక్తులందరి సహకారంతో స్వామికి బంగారు కవచాన్ని, వజ్రకవచాన్ని సమకూర్చారు. వీటిని ప్రత్యేక పర్వదినాల్లో స్వామికి అలంకరిస్తారు.

త్వరలో చేపట్టబోయే పనులు

స్వామి సన్నిధిలో తలనీలాలు సమర్పించేందుకు ఎంతో మంది వస్తున్నారు. తిరుమలకు ఆ సమయంలో వెళ్లలేని భక్తులు ఇక్కడ తలనీలాలను సమర్పిస్తున్నారు. దీంతో వారి కోసం శాశ్వత ప్రాతిపదికన ఒక కల్యాణ కట్ట నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రూ.2కోట్ల అంచనాలతో స్వామివారి పుష్కరిణి నిర్మించనున్నారు. పుష్కరిణి కోసం కేటాయించిన స్థలంలో కొండలు ఉండడంతో వాటిని తొలగించి నిర్మాణం చేస్తున్నారు. పుష్కరిణిలో కూడా అందమైన దేవతామూర్తుల విగ్రహాలు, మధ్యలో మండపంపైన కాళీయమర్దన బాల శ్రీకృష్ణమూర్తిని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆలయం బయట సుందర నందనవనం ఏర్పాటు చేస్తున్నారు.


మూలవిరాట్ స్వామివారు

పుష్కరిణి పనులు ప్రారంభించాం



ఆలయ ఆవరణలో స్వామి పుష్కరిణి పనులు ప్రారంభించాం. స్వామి వైభవం చాటేందుకు అందరి సహకారంతో కృషి చేస్తున్నాం. నారాయణ తిరుమలలో స్వామివారిని దర్శించుకునే వారికి సకల శుభాలు కలుగుతాయి.

– జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త

భక్తుల రద్దీ పెరుగుతోంది



ఆలయంలో భక్తుల రద్దీ నానాటికీ పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నాం. అష్టోత్తర శతనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి పండగలకు ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తుల ఆదరణతోనే ఆలయం అభివృద్ధి చెందుతోంది.

– శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు

కల్యాణోత్సవాల వివరాలు

- 17న స్వామి విశ్వరూపదర్శనం,క్షీరాబిషేక మహోత్సవం, ఉత్సవ సంకల్పం, మంటపారాధన.
- 18న స్వర్ణకవచ దర్శనం, విశేష ఆరాధన, సహస్ర తులసీదళార్చనలు, సాయంత్రం ధ్వజారోహణం.
- 19న శ్రీవారి వజ్రకవచ దర్శనం, సాయంత్రం భునీళా సమేత వేంకటేశ్వరస్వామివారి తిరుక్కల్యాణమహోత్సవం.
- 20న శ్రీవారి రజత కవచ దర్శనం, సాయంత్రం శ్రీవారి గరుడ వాహన సేవ తిరువీధి ఉత్సవం.
- 21న వైరముడి కవచన దర్శనం, సహస్రనామార్చనలు, మహాలక్ష్మీకి కుంకుమార్చన.
- 22న విశేష ఆరాధన, సహస్రనామార్చనలు, ఉయ్యాల సేవ.
- 23న పుష్ప కవచ దర్శనం, చూర్ణోత్సవం, అవభృత స్నానం, సాయంత్రం పుష్పయాగ మహోత్సవం
- ప్రతిరోజు అఖండ విష్ణు సహస్రనామ పారాయణం.



క్లుప్తంగా

డోలీలో ప్రసవం


డోలీలో తల్లీ బిడ్డలను ఆస్పత్రికి తీసుకువస్తున్న గిరిజనులు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ శృంగవరపుకోట పరిధిలోని గిరిశిఖర గ్రామమైన రేగపుణ్యగిరి గ్రామానికి చెందిన గిరిజన మహిళ గురువారం డోలీలోనే ప్రసవించింది. ఎస్.కోట పట్టణానికి 9కి.మీ దూరంలో గిరిశిఖరాన ఉన్న రేగపుణ్యగిరి గ్రామానికి చెందిన గిరిజన మహిళ వంతల కుషాయి గర్భిణి. ఆమెకు ఇది 5వ కాన్పు కాగా గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు ఆరంభమయ్యాయి. దీంతో ఆమెను డోలీలో ఆస్పత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మధ్యాహ్నం 3గంటల సమయంలో డోలీలోనే ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను, బిడ్డను ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్.కోట ఏరియా ఆస్పత్రి సిబ్బంది తల్లీబిడ్డలకు ప్రథమచికిత్స చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలోనే క్షేమంగా ఉన్నారు.

గుదిమెళ్లకు 'దేశికాచార్య పురస్కారం'


పీఠాధిపతుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న గుదిమెళ్ల

విజయనగరం టౌన్: స్థానిక రింగురోడ్డులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108 రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమంలో ప్రధాన భూమిక పోషించిన తిరుమల గుదిమెళ్ల అనంత వెంకట జగన్నాథచార్యస్వామిని శ్రీ దేశిక ట్రస్ట్, ఉత్తరాంధ్రా వైష్ణవ పీఠం తరపున దేశికాచార్య పురస్కారంతో పాటు శ్రీరామాయణ పారాయణార్ణవ బిరుదుతో గురువారం ఘనంగా సత్కరించారు. శ్రీవారి ప్రసాదంగా దుశ్శాలువ, పట్టువస్త్రాలు అందజేశారు. అనంతరం పురస్కార గ్రహీత మాట్లాడుతూ వైభవోపేతమైన శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమంలో పురస్కారం అందుకోవడం తన జన్మ సార్థకమైందన్నారు. కార్యక్రమంలో తిరంగళ కుమారి, భాస్కరా సీతారామపావని లాస్యశ్రీ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొల్లల ములగాంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

చీపురుపల్లి రూరల్: మండలంలోని గొల్లల ములగాం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ కొనసాగుతోంది. ఈనెల 13న గ్రామంలో జరిగిన ఎన్నికల పోలింగ్ బూత్ వద్ద ఓ వృద్ధురాలు ఓటు వేసే అంశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇదే అంశంపై మరుసటి రోజు కూడా గ్రామంలోని రచ్చబండ వద్ద ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగి స్వల్ప కొట్లాటకు దారి తీసింది.ఈ కొట్లాటలో ఇరువర్గాల వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరువర్గాల వారిని శాంతింపచేశారు. ఈ క్రమంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో బుధవారం నుంచి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని, పోలీస్ పికెట్ కొనసాగుతుందని, గ్రామంలో ఘర్షణ వాతావరణం సాధారణ స్థితికి వచ్చేంత వరకు పోలీస్ పికెట్ కొనసాగుతుందని ఎస్సై స్పష్టం చేశారు.

నూతిలో పడి వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: ప్రమాదవశాత్తు నూతిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. విజయనగరం మండలం పరిధిలో జరిగిన ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదుతో రూరల్ పోలీసులు గురువారం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. నర్సీపట్నంలోని బైరెడ్డిపాలెంకు చెందిన బి.చిన్నినాయుడు (45) విజయనగరంలో ఉద్యోగ రీత్యా ఉంటున్న భార్యాబిడ్డలను చూసేందుకు రెండురోజుల క్రితం వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం బయటకు వెళ్లివస్తానని చెప్పిన వెళ్లి తిరిగి ఇంటికి చేరకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసులు దర్యాప్తులో భాగంగా జొన్నవలస బైపాస్ రోడ్డు పక్కన ఉన్న నూతి దగ్గర అతని స్కూటీని గుర్తించారు. అనంతరం నూతిలో గాలించి గురువారం మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతునికి భార్య సుజాత, ఒక పాప ఉన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై శ్యామలాదేవి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ..

దత్తిరాజేరు: మండలంలోని మరడాం పంచాయతీ మర్రివలస సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రైల్వే ఎస్సై రవికుమార్, కానిస్టేబుల్ ఈశ్వరరావు గురువారం తెలిపారు. వారం రోజుల క్రితం రైలు కింద పడి మృతి చెందిన మహిళ శరీర భాగం మురుగు కాలువలో ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్ 9491813163, 9989570010లకు సమాచారం అందించాలని కోరారు.

గ్రామాల్లో ఉపాధి

- జిల్లాలో జోరందుకున్న పనులు
- ఇతర రాష్ట్రాలకు తగ్గిన వలసలు


పార్వతీపురం మండలంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

పార్వతీపురంటౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు పనులు కల్పిస్తూ వేతనాలను సకాలంలో చెల్లిస్తున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో పనులు జోరుగా జరుగుతున్నాయి. వాస్తవానికి 2023–24 ఆర్థిక సంవత్సరంలో కోటి పనిదినాల లక్ష్యానికి గాను మార్చి 31 నాటికి లక్ష్యానికి మించా 1.23 కోట్ల మేర పనిదినాలు పూర్తి చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల కోసం రూ.376.95 కోట్లను ఖర్చు చేశారు. ఉపాధి పనులకు హాజరైన కూలీలకు సుమారు రూ.300.35 కోట్లను చెల్లించారు. రోజువారీ వేతనం రూ.296.69 అందించారు. గతంతో పోలిస్తే ఈ మొత్తం అధికం. వేతన చెల్లింపులను వారి ఖాతాల్లో జమచేస్తున్నారు. పనుల పర్యవేక్షణకు క్లస్టర్ ఏపీడీలు, ప్రతి మండలంలో ఏపీఓ, ఈసీ, టీఏలు, బీఎఫ్టీలు, ఎఫ్ఏలు అందుబాటులో ఉంటున్నారు. కూలీలు చేసిన పనుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేందుకు వీలుగా కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతి మండలంలో అందుబాటులో ఉన్నారు.

వేతనం తగ్గకుండా..

ఉపాధి కూలీల గరిష్ట వేతనం రూ.296 ఉంది. ఉపాధి పనులకు వచ్చే కూలీలందరూ ఈ వేతనం అందుకునే విధంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో అత్యధికంగా తుగ్గలి మండలంలో రోజుకు 10 వేలకుపైగా పనిదినాలు కల్పిస్తున్నారు. బలిజిపేట, మక్కువ, జియ్యమ్మవలస, కురుపాం మండలాలు టాప్‌లో ఉన్నాయి.

60 లక్షల పనిదినాలు లక్ష్యం

2024–25 ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. కూలీలకు రోజుకు రూ.296 వేతనం వచ్చేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ లక్ష్యాన్ని పూర్తి చేసిన అనంతరం మరో 60 లక్షల పనిదినాలను ప్రభుత్వం కేటాయించే అవకాశం ఉందని డ్వామా అధికారులు తెలిపారు.


పరిశీలిస్తున్న అధికారులు

కోవిడ్ సమయంలోనూ ఆపన్నహస్తం

కోవిడ్ సమయంలో పరిశ్రమలు, దుకాణాలు, హోటళ్లు, మాల్స్ అన్నీ మూతపడ్డాయి. పనుల్లేక పేద, మధ్య తరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. బయటకొస్తే కోవిడ్ బారినపడతామనే భయంతో ఇంటికే పరిమితమయ్యారు. ఆ సమయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కూలీలను ఉపాధి పనులు ఆదుకున్నాయి. కోవిడ్ నిబంధనలను పాటిస్తూ కూలీలకు పనులు కల్పించారు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో 94.29 లక్షల పనిదినాలను కల్పించగా, కూలీలకు వేతనాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు.

అక్రమాలకు తావు లేకుండా..

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్) ద్వారా కూలీలకు హాజరు వేస్తున్నారు. గతంలో మస్టర్ మాన్యువల్‌గా వేస్తుండడం వల్ల బోగస్ హాజరు ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. బోగసుకు తావు లేకుండా ఎన్ఎంఎంఎస్ యాప్‌లో రోజుకు రెండు సార్లు హాజరుతో పాటు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రతి రోజు రెండుసార్లు ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు వేస్తుండడం వల్ల మస్టర్లో అక్రమాలు తగ్గేందుకు అవకాశం ఏర్పడింది.

జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం

ఉపాధి హామీ పథకం కింద జలసంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. చెరువుల్లోకి వర్షపు నీరు వెళ్లేందుకు ఫీడర్ చానల్లో పూడిక తీయించే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. కాల్వల నుంచి పంట పొలాలకు వెళ్లే ఫీల్డ్ చానల్స్‌ను బాగు చేయిస్తున్నారు. అమృత్ సరోవర్లుగా గుర్తించిన చెరువులు, చెక్ డ్యామ్ పూడిక తీత పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. మేజర్ కెనాల్స్, బౌండరీ ట్రెంచెస్, ఫాంపాండ్స్ తవ్వకాల పనులు జరుగుతున్నాయి. అవెన్యూ ప్లాంటేషన్, పండ్లతోటల అభివృద్ధికి ఉపాధి నిధులతోనే గుంతలు తవ్వుకునే పనులు కల్పిస్తున్నారు.

కూలీల సంఖ్యను పెంచుతాం



ఈ ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పనిదినాల లక్ష్యాన్ని కేటాయించారు. దీన్ని పూర్తి చేసిన అనంతరం ఈ సంఖ్యను పెంచనున్నారు. ప్రస్తుతం రోజుకు 60 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. వారి సంఖ్యను పెంచేలా చర్యలు చేపడుతున్నాం. కూలీలకు సంబంధించిన వేతనాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నాం.

–రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

ఏడిస్ దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ఏడిస్ దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో డెంగీ నిర్ధారణ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి విజయనగరం, ప్రాంతీయ ఆసుపత్రి రాజాంలో ఉందని తెలిపారు. క్షేత్రస్థాయిలో డెంగీని ప్రాథమిక దశలో గుర్తించడానికి వీలుగా రేపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇంట్లోను, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా డెంగీ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. డీఎంఓ వై.మణి, ఎపిడిమాలజిస్టు డాక్టర్ జి. వెంకటేష్, బి.మహాలక్ష్మి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్షయ బాధితులకు టీకా వేయాలి

క్షయ టీకా (బీసీజీ వ్యాక్సిన్)ను జిల్లాలో గుర్తించిన బాధితులందరికీ వేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. వయోజనులకు వేసే క్షయ టీకా కార్యక్రమాన్ని పలు ప్రాంతాల్లో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాక్సిన్ వేసేటప్పుడు వైద్య సిబ్బంది ఆరు ప్రమాణాలను పాటించాలన్నారు. గత ఐదు సంవత్సరాల్లో క్షయ వ్యాధి వచ్చి తగ్గిపోయిన వారికి, 18 ఏళ్లు నిండిన వారికి, పొగ తాగేవారికి, మధుమేమ వ్యాధిగ్రస్తులకు, క్షయ రోగులతో సన్నిహిత సంబంధాలు ఉన్న వారికి టీకా వేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డాక్టర్ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు


నిందితులను విచారణ చేస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు విజయనగరం పట్టణంలో ఓ హోటల్ యజమాని వద్ద డబ్బులు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చి వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో రంగంలోకి దిగిన వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు వివరాలిలా ఉన్నాయి. గరివిడికి చెందిన గొర్లె మహేశ్వరరావు బీటెక్ (ఈఈఈ) చదివి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మెంబర్‌గా కారుపై బోర్డు పెట్టుకుని విశాఖ జిల్లా మధురవాడకు చెందిన పాస్టర్ అరసాడ కిరణ్, యూట్యూబ్ చానెల్ ఎంఎస్99డిజిటల్ న్యూస్ సీఈఓగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురానికి చెందిన తర్లాడ దయానంద్, తెర్లాంకు చెందిన లావేటి కామేశ్వరరావులు ఈ నెల 10న పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న ఓ ప్రైవేట్ హోటల్‌కు వెళ్లి తమ ప్రతాపాన్ని చూపించారు. అయితే ఆ రోజు సంబంధిత హోటల్ యజమాని లేకపోవడంతో గురువారం మళ్లీ వచ్చారు. పథకం ప్రకారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లా హడావిడి చేసి రూ.50వేలు డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన సదరు యజమాని వెంటనే పోలీసులకు సమాచారమందించారు. దీంతో రంగంలోకి దిగిన వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఎస్సై హరిబాబునాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. బాధిత యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

19 నుంచి దాడితల్లి, సరే పోలమ్మ పండగలు

- ఏర్పాట్లలో గొల్లపల్లి, పాతబొబ్బిలి ఉత్సవ కమిటీలు


గొల్లపల్లి దాడితల్లి అమ్మవారు


పాత బొబ్బిలి సరేపోలమ్మ అమ్మవారు


పట్టణంలో ఘటాల ఊరేగింపు

బొబ్బిలి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పులు, కోరిన కోరికలు తీర్చే గొల్లపల్లి దాడితల్లి, పాత బొబ్బిలి సరేపోలమ్మ అమ్మవార్ల సిరిమానోత్సవ సంబరాలు మరో రెండు రోజుల్లో జరగనున్నాయి. ఈనెల 19,20,21 తేదీల్లో ఉత్సవాలను అంగరంగ వైభవంగా అమ్మవార్ల పండగలు నిర్వహించేందుకు రెండు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈనెల 19న దేశతల్లి అమ్మవారి ఉత్సవంతో ప్రారంభమయ్యే పండగలో భాగంగా 20న సిరిమానోత్సవం జరుగుతుంది. 21న అనుపోత్సవం నిర్వహిస్తారు. ఈ జంట సంబరాలకు రెండు ప్రాంతాల్లో భక్తులు సన్నద్ధమయ్యారు. గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండగను చుట్టుపక్కల 12 గ్రామాల వారు ఘనంగా జరుపుకుంటారు. అలాగే పాత బొబ్బిలిలో సరేపోలమ్మ ఉత్సవాలు కూడా ఈనెల 19నే ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రభల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గొల్లపల్లి, పాత బొబ్బిలి అమ్మవార్ల సిరిమానోత్సవాలు సోమవారం ఘనంగా జరుగుతాయి. పాత బొబ్బిలి నుంచి పట్టణంలోకి సిరిమాను ప్రవేశించి పురవీధులన్నీ కలియదిరిగి భక్తులను పరవశింప చేస్తుంది. అలాగే గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమాను కూడా సోమవారం సాయంత్రం గొల్లపల్లి నుంచి ఊరేగింపుగా ప్రారంభమై పట్టణంలోకి ప్రవేశించి పట్టణంలోని అన్ని వీధుల్లోనూ కలియదిరుగుతుంది. ఉత్సవాలలో భాగంగా పాత బొబ్బిలి, గొల్లపల్లిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సాము గరిడీలు, బిందెల డ్యాన్సులు, తప్పెట గుళ్లు, కోలాటం, భారీ లైటింగ్, బళ్ల వేషాలు, కాంతార హంస డ్యాన్స్, బాహుబలి ప్రదర్శన, తీన్‌మార్, డీజే, మందుగుండుసామగ్రి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, ఒడిశా ప్రాంతాల నుంచి కూడా భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. ఇప్పటికే పట్టణంలో అమ్మవార్ల ఘటాలు తిరుగుతూ భక్తులకు ఆశీర్వాదాలు అందిస్తున్నాయి.

పకడ్బందీగా మలేరియా మందు పిచికారీ

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఓ టి.జగన్‌మోహనరావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా మలేరియా మందు పిచికారీ చేస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా మలేరియా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించామని, తొలివిడత స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. తొలి రెండు రోజుల్లో 42 గ్రామాల్లో స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. శుక్రవారం జిల్లాలోని 18గ్రామాల్లో పిచికారీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. డోకిశీల పీహెచ్‌సీ పరిధిలో 6, మామిడిపల్లి పీహెచ్‌సీ పరిధిలో 5, డోనుబాయి పీహెచ్‌సీ పరిధిలో 4, బాలేరు పీహెచ్‌సీ పరిధిలో 2, మాదలింగి పీహెచ్‌సీ పరిధిలో 1, తాడికొండ పీహెచ్‌సీ పరిధిలో 1 గ్రామాల్లో దోమల మందు పిచికారీ కార్యక్రమం చేపడతామని, జిల్లా వ్యాప్తంగా మలేరియా కేసులు తగ్గించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తొలివిడత పూర్తయిన వెంటనే రెండవ విడత స్ప్రేయింగ్ కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పెరుగుతున్న రక్తపోటు

- ఏటా అధికసంఖ్యలో వ్యాధిగ్రస్తుల నమోదు
- జిల్లాలో బాధితులు 18, 322 మంది
- తగుజాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు


సర్వజన ఆస్పత్రిలో రోగికి బీపీ చెక్ చేస్తున్న స్టాఫ్‌నర్సు

విజయనగరం ఫోర్ట్: మానవుడి ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులతో పాటు ఉరుకులు పరుగులతో జీవనం సాగిస్తున్నారు. అదేవిధంగా శారీరక శ్రమకు దూరమవుతున్నారు. ఉద్యోగులు పనిఒత్తిడికి, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారు జీవనం ఏవిధంగా సాగించాలనే ఆందోళన, విద్యార్థులకు మంచి భవిష్యత్తుపై ఆలోచనల ఫలితం హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటుకు)కు దారితీస్తోంది. శుక్రవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న కథనం. ప్రపంచ జనాభాలో ప్రతి పదిమందిలో ఒకరు అధిక రక్తపోటుతోనే చనిపోతున్నారు. ప్రాణాంతకమైన వ్యాధుల్లో అధిక రక్తపోటు మూడోస్థానంలో ఉంది.

హైపర్ టెన్షన్‌లో రెండు రకాలు

హైపర్ టెన్షన్‌లో రెండు రకాలు ఉన్నాయి. వాటిలో మొదటిది ఎసున్షయల్ హైపర్‌టెన్షన్, రెండోది సెకండరీ హైపర్ టెన్షన్

ఎసున్షయల్ హైపర్ టెన్షన్:

అధిక ఒత్తిడి, అధికబరువు, వ్యాయమం లేకుండా ఎక్కువగా కూర్చుని పనిచేయడం, పొగతాగడం, అధిక కొవ్వు ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల ఎసున్షయల్ హైపర్ టెన్షన్ వస్తుంది.

సెకెండరీ హైపర్ టెన్షన్:

కిడ్నీ సమస్యలు, హైపో థైరాయిడ్, కొన్ని హార్మోన్ల సమస్య వల్ల సెకెండరీ హైపర్ టెన్షన్ వస్తుంది.

హైపర్ టెన్షన్ వల్ల అనర్థాలు

హైపర్ టెన్షన్ వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. పక్షవాతం, గుండెపోటు, కిడ్నీలు చెడిపోవడం తదితర సమస్యలు వచ్చి ప్రాణం మీదకు వస్తుంది. నిత్యం పని ఒత్తిడిలో పడి ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తే మొదటిగా వచ్చేది హైపర్ టెన్షనే. ఒకసారి ఈవ్యాధి వస్తే మరిన్ని వ్యాధులు సోకే ప్రమాదం ఉంది.

వ్యాధిని గుర్తించడం

వ్యాధిలో సాధారణంగా ఎటువంటి లక్షణాలు కనిపించవు. బీపీని వైద్యులు పరీక్షల ద్వారానే గుర్తించగలరు. రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు మాత్రమే కొన్ని లక్షణాలు బయటపడతాయి. తలనొప్పి, శ్వాసతీసుకోవడంలో కష్టం, ఛాతీలో నొప్పి కనిపిస్తాయి.

అధిక రక్తపోటు

రక్తనాళాల్లో రక్తం సాధారణ ఒత్తిడికంటే ఎక్కువ ఒత్తిడితో ప్రసరించినప్పుడు దానిని అధిక రక్తపోటు అంటారు. బీపీ కొంతవ్యవధి పాటు 140/90 ఎంఎంహెచ్‌జీ లేదా అంతకన్నా ఎక్కువగా ఉన్నట్లయితే వైద్యులు అధిక రక్తపోటుగా గుర్తిస్తారు. తరచూ రక్తపోటు తనిఖీ చేయించుకోవాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రక్తపరీక్ష చేయించుకోవాలి. హైపర్ టెన్షన్ ఉన్నట్లయితే వైద్యుడిని సంప్రదించాలి.

అధిక రక్తపోటుకు కారణం:

నూడిల్స్, చాట్స్ పానీ పూరీ వంటి జంక్ ఫుడ్స్ తినడం వల్ల, టీవీ అధికంగా చూడడం, శారీరక వ్యాయమం లేకపోవడం, ఒకే చోట 8 నుంచి 12 గంటలు పాటు పనిచేయడం, మానసిక ఒత్తిడి, సంఘర్షణ, ఆత్మనూన్యత, పొగ, ఆల్కహాల్ తాగడం వంటి వాటి వల్ల అధిక రక్తపోటు వస్తుంది.

రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

ప్రతిరోజూ అరగంట పాటు వ్యాయమం చేయాలి. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా గడపాలి. పొగతాగడం, మద్యంసేవించడం పూర్తిగా మానివేయాలి. యోగా, దైవభక్తి పెంపొదించుకోవాలి. ఉప్పు, మసాలాలు తగ్గించుకోవాలి. 30 సంవత్సరాలు పైబడిన వారు ప్రతి 6 నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్ష చేయించుకోవాలి.

18, 322 మంది రోగులు

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం వేలాది మంది బీపీతో చికిత్స పొందుతున్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఎన్‌పీడీ క్లినిక్స్‌కు వచ్చిన రోగులకు బీపీ చెక్ చేస్తారు. 2023ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు 31,733 మందిని పరీక్షించగా వారిలో ఈఏడాది కొత్తగా 1997 మందికి బీపీ నిర్ధారణ అయింది. ప్రస్తుతం జిల్లాలో 18, 322 మంది బీపీకి చికిత్స పొందుతున్నారు. సర్వజన ఆస్పత్రిలో కొత్తగా115 మందికి బీపీ నిర్ధారణ అయింది. సర్వజన ఆస్పత్రి ఎన్‌సీడీ క్లినిక్ పరిధిలో 1623 మంది చికిత్స పొందుతున్నారు.

ఆర్థిక పరిపుష్టి దిశగా విజయనగరం

- శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్
- ఇక్కడ ఎంతో నేర్చుకున్నా.. మంచి సేవలు అందించే ప్రయత్నం చేస్తా..


మీడియాతో మాట్లాడుతున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్


కలెక్టర్ నాగలక్ష్మికి కృతజ్ఞతలు తెలుపుతున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఆర్థిక వనరులు పెంచే దిశగా విజయనగరం జిల్లా అభివృద్ధి చెందుతోంది.. భోగాపురం ఎయిపోర్ట్ కార్యకలాపాలు మొదలయ్యాక ఈ ప్రాంతం ఆర్థికంగా వృద్ధి సాధిస్తుంది.. జిల్లాకు మంచి భవిష్యత్తు ఉందని ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. ఆయన జిల్లాలో ఏడాది శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో తను గుర్తించిన అభివృద్ధి వనరులు, జిల్లా పరిస్థితులు, అధికారుల సహాయసహకారాలు తదితర వివరాలను వెల్లడించారు. ఆయన మాటల్లోనే... జిల్లాలో ఏడాది శిక్షణ ద్వారా వచ్చిన అనుభవంతో రానున్న రోజుల్లో ప్రజలకు మంచి సేవలు అందించగలననే నమ్మకం వచ్చింది. జిల్లాలో పనిచేసిన కాలంలో రైలు ప్రమాద దుర్ఘటన, సార్వత్రిక ఎన్నికల నిర్వహణతో పాటు ఇతర విపత్తుల సమయంలో పాలన సామర్థ్యాన్ని నిరూపించుకో గలిగాను. విభిన్న పరిస్థితుల్లో ఏ విధంగా వ్యవహరించాలనే అంశాలను నేర్చుకున్నాను. చీపురుపల్లిలో ఆర్డీఓగా, మెంటాడలో తహసీల్దార్‌గా తీసుకున్న శిక్షణ మంచి అనుభవాన్నిచ్చింది. వివిధ హోదాల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏయే విధులు నిర్వహిస్తారనే అంశాలపై, ప్రోటోకాల్ నిర్వహణ అంశాలపై అవగాహన కలిగింది. ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన ఓటర్ల చైతన్య కార్యక్రమం 'స్వీప్'లో భాగస్వామ్యం ఎంతో తృప్తినిచ్చింది. స్వీప్ ద్వారా చేపట్టిన ప్రజా చైతన్య కార్యక్రమాల వల్లే ఇటీవల జరిగిన ఎన్నికల్లో గతం కంటే రెండు శాతం మేరకు ఓటింగ్ పెంచగలిగాం. జిల్లాలోని ఎన్నికల నిర్వహణలో ఇచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ మెంబర్ బాధ్యత ఫలితాలు దృఢ సంకల్ప దృక్పథాన్ని పెంచింది. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీని నియంత్రించేందుకు పలు చోట్ల దాడులు నిర్వహించి మద్యం నిల్వలను స్వాధీనం చేసుకోవడంలో సమష్టి కృషి ఫలించింది. నెల్లిమర్లలో ఉన్న డిపో నుంచి మద్యం నిల్వలపై పర్యవేక్షణ బాధ్యత మంచి అనుభవాన్నిచ్చింది. జిల్లాలో శిక్షణ పొందిన కాలంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ల మయూర్ అశోక్, కార్తీక్‌లు తనకు ఎంతోగానో సహకరించి ప్రోత్సహించారు. తదుపరి శిక్షణలో భాగంగా రెండు నెలల కాలంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖకు న్యూఢిల్లీ వెళ్లనున్నట్టు త్రివినాగ్ తెలిపారు. హైదరాబాద్ ఐఐటీ నుంచి మెటలర్జికల్ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన తనకు తండ్రి బి.జయకుమార్ సివిల్ సర్వీసెస్ సాధనకు ఎంతగానో స్ఫూర్తినిచ్చారని చెప్పారు. అనంతరం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి శిక్షణలో ఇచ్చిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు.